ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 2 జూన్ 2025



విదేశాల్లో డిమాండ్..

పశుమాంసానికి కొన్ని దేశాల్లో విపరీతమైన గిరాకీ. అక్కడ పశుమాంసం విక్రయాలు, వినియోగానికి ఎటువంటి ఆంక్షలు కూడా ఉండవు. దేశీయంగా కిలో పశుమాంసం రూ.250 నుంచి రూ.450 పలుకుతోంది. కానీ అక్కడ మాత్రం రూ.5వేల నుంచి రూ.6 వేలకు విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. ఉత్తరాంధ్రతోపాటు ఒడిశాకు చెందిన పశువులను వధించి పోర్టులు, ఇతరత్రా అక్రమ మార్గాల్లో ఇతర దేశాలకు చేర్చుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నవారు జిల్లాలో చాలాప్రాంతాల్లో పశువుల కొనుగోలుకు కొంతమంది దళారులను ఏర్పాటు చేసుకున్నట్టు సమాచారం. కొనుగోలుదారుల విషయం అసలు బయటకు తెలియదు. రైతుల రూపంలో గ్రామాల్లోకి వస్తారు. పశువులను కొనుగోలు చేస్తారు. వాటిని రహస్య ప్రాంతాలకు తరలిస్తారు. రాత్రిపూట లారీలు, ఇతర వాహనాల్లో కుక్కి తరలిస్తుంటారు. మరికొందరైతే కంటైనర్లతో రహస్యంగా తరలించుకుపోతున్నారు.

మూగరోదన.. వినేదెవరు?

- కబేళాలకు పశువుల తరలింపు
- దారుణంగా వాహనాల్లో కుక్కి రవాణా
- కానరాని కనీస నిబంధనలు
- ఏటా జిల్లాలో తగ్గిపోతున్న ఆవులు, గేదెలు

● గత నెల 25న ఎచ్చెర్ల మండలం నవభారత్ జంక్షన్ వద్ద పోలీసులకు అక్రమంగా తరలిస్తున్న రెండు పశువుల వ్యాన్‌లు పట్టుబడ్డాయి. నారాయణవలస నుంచి అలమండకు తరలిస్తున్న 12 ఆవులతో ఓ వ్యాన్, 6 గేదెలతో మరో వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటిని కొత్తవలస గోశాలకు తరలించారు.

● గత నెల 30న నరసన్నపేట నుంచి విశాఖ వైపు తొమ్మిది ఆవులతో వెళ్తున్న వ్యాన్‌ను బుడుమూరు వద్ద లావేరు పోలీసులు అడ్డుకుని సీజ్ చేశారు. నరసన్నపేట పరిసర ప్రాంతాల్లో వాటిని కొనుగోలు చేసి తరలిస్తున్నట్టు గుర్తించామని పోలీసులు వెల్లడించారు.

ఇచ్ఛాపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో మూగజీవాల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇప్పటివరకూ వ్యవసాయం, పాల ఉత్పత్తి కోసం పశువులను పెంచారు. కానీ ఇప్పుడు కొంత మంది దగ్గరుండి వాటిని కబేళాలకు పంపుతున్నారు. పశుపోషణ భారమై.. యంత్రాలతో సాగుచేస్తున్నవారు పశువులను విక్రయిస్తున్నారు. సాటి రైతుకు విక్రయిస్తే పర్వాలేదు కానీ.. దళారులకు విక్రయిస్తుండడంతో అవి జిల్లాలు, రాష్ట్రాలు దాటి కబేళాలకు తరలిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. వాటి రోదన వర్ణనా తీతంగా మారింది. క్రమేపీ జిల్లాలో ఏటా పశువుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. ఈ ఏడాది పశుగణన పూర్తయిన తర్వాత 4,56,000 ఆవులు, 46,000 గేదెలు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఓ దశాబ్దం కిందట ఒక్క నియోజకవర్గంలోనే సుమారుగా ఇన్ని ఆవులు, గేదెలు ఉండేవంటే అతిశయోక్తి కాదు. ప్రస్తు తం వ్యవసాయంలో యాంత్రీకరణ రావడంతో రైతులకు పశువుల అవసరం లేకుండా పోతోంది. దీంతో చాలామంది పశువులను సంతల్లో విక్రయిస్తున్నారు. వాటిని (మిగతా 7వ పేజీలో..)

ప్రతీవారం వేల పశువులు

జిల్లాలో అంపురం, బుడుమూరు, తిలారు సంతలు ప్రముఖంగా ఉన్నాయి. వీటి నుంచి వారానికి 5 నుంచి 8వేల వరకూ ఆవులు ఇతర ప్రాంతాలకు తరలించుకుపోతున్నారని తెలుస్తోంది. కొనుగోలుచేసిన పశువులను గ్రేడింగ్ చేస్తున్నారు. ఆరోగ్యంగా ఉన్నవి ఒక వైపు.. అనారోగ్యంగా ఉన్నవాటిని మరోవైపు విభజిస్తారు. అనారోగ్యంగా ఉన్నవాటిని మన రాష్ట్రంతో పాటు పొరుగున ఉన్న హైదరాబాద్‌కు తరలిస్తారు. ఆరోగ్యంగా ఉన్నవాటిని దక్షిణాది రాష్ట్రాల్లో వివిధ పోర్టులకు తరలించి.. అక్కడ నుంచి విదేశాలకు తరలిస్తున్నట్టు సమాచారం. పోలీసుల నిఘా ఎక్కువ కావడంతో లారీలాంటి ప్రత్యేక వాహనాల్లో రెండు అంతస్తుల్లో వాటిని రూపొందించి పశువుల తరలింపునకు వినియోగిస్తున్నారు. సాధారణంగా 15-20 పట్టే వాహనాల్లో.. 40 నుంచి 50 పశువులను ఎక్కిస్తుంటారు. ఒక్కో వాహనంలో గమ్యస్థానాలకు పశువులు తరలించాలంటే రూ.3లక్షల వరకూ వసూలు చేస్తారు. కేరళ సరిహద్దు ప్రాంతాలకు వెళ్లిన తరువాత క్షేమంగా గమ్యానికి చేరినట్టే. అక్కడ పశువుల రవాణాపై ఎటువంటి ఆంక్షలు ఉండవు.



కాలేజీకి వేళాయే

- నేటి నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం
- ఈ ఏడాది కొత్త సిలబస్ అమలు
- ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు

నరసన్నపేట/ హిరమండలం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం ఆరంభం కానుంది. ఇంటర్మీడియట్ తరగతులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్యలో నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెడుతోంది. ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బలోపేతం చేసేలా సంస్కరణలు తీసుకురానుంది. ప్రభుత్వ కళాశాల విద్యార్థులను ప్రథమ సంవత్సరం నుంచే నీట్, ఐఐటీ, ఈఏపసెట్ వంటి పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేలా సిలబస్‌ను రూపొందించింది. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 38, ప్రైవేటు కళాశాలలు -71, మోడల్ స్కూల్స్‌లో కళాశాలలు -13, కెజీబీవీలు -25, సోషల్ వెల్ఫేర్ (మిగతా 8వ పేజీలో..)

రేషన్ డిపోల్లోనే సరుకుల పంపిణీ

- వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే అందజేస్తాం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల నుంచి రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తాం. దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు వారి ఇళ్ల వద్దకే రేషన్ అందజేస్తామ'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన అరసవల్లిలోని డీసీఎంఎస్ వద్ద గల రేషన్ డిపోను పునఃప్రారంభించారు. అలాగే బొంపాడవీధిలోని ఒక దివ్యాంగుడికి, వృద్ధురాలికి స్వయంగా ఇంటికి వెళ్లి రేషన్ సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'జిల్లాలో 1,603 రేషన్ డిపోల పరిధిలో 6.60 లక్షల కార్డులు ఉన్నాయి. అందులో దివ్యాంగులు, 65ఏళ్లు దాటిన వృద్ధులు 75 వేలమంది ఉన్నారు. వీరందరికీ ఇళ్ల వద్దకే సరుకులు అందజేస్తాం. మిగిలిన లబ్ధిదారులందరికీ ప్రతీ నెల 1వ తేదీ నుంచి 15వరకు రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తాం. ఉదయం 8 గంటల నుంచి 12 వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులను తీసుకోవచ్చు. ప్రస్తుతం, బియ్యం పం చదార ఇస్తున్నాం. ఏ డిపో పరిధిలోనైనా సమస్యలుంటే కంట్రోల్ రూం, డీఎస్‌వోకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయండి' అని సూచించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాష్, సీఎస్‌డీటీ చక్రి, 25వవార్డు ఇన్‌చార్జి టి.నాగరత్నం, ఉంగటి వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.



వృద్ధురాలికి రేషన్ సరుకులు అందజేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్



కేశవరావు (ఫైల్)

జీయన్నపేటలో కేశవరావు కర్మకాండలు

- గ్రామంపై పోలీసుల నిఘా

8లో

ఆఫ్‌షోర్ నిర్వాసితుల బైక్ ర్యాలీ

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

8లో

ఆదాయం వచ్చే పంటలను సాగు చేయండి

- కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త హరికుమార్

8లో

బీచ్ కబడ్డీ పోటీలకు రిఫరీలుగా ఎంపిక

7లో

ఆదిత్యా.. అవే అవస్థలు

- అరసవల్లిలో మారని సిబ్బంది తీరు
- కానరాని కనీస సౌకర్యాలు
- [illegible]
- ఎండలో భక్తులకు తప్పని ఇబ్బందులు



అరసవల్లిలో భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

అరసవల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో భక్తులకు ఇబ్బందులు కొనసాగుతూనే ఉన్నాయి. రోజురోజుకూ భక్తుల తాకిడి పెరుగుతుండగా, వారికి సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పరిసరాలను పరిశుభ్రం చేయించడం లేదని, అక్రమ వసూళ్లను సైతం అరికట్టలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం కూడా వేలాది మంది భక్తులు ఆలయానికి రాగా.. ఒక్కరోజే స్వామికి రూ.10,46,523 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.6,38,100, విరాళాల రూపంలో రూ.1,05,828, ప్రసాదాల ద్వారా రూ.2,02,595 ఆదాయం సమకూరింది. కాగా.. అధికారుల పర్యవేక్షణ లోపంతో భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. నీడ సౌకర్యం లేక మండేఎండలో.. క్యూలో నిల్చొని అవస్థలు పడ్డారు.

● వసూళ్ల దందా ఆపేదే లేదు..

ఆలయ ఆవరణలో సోడా, ఐస్‌క్రీమ్‌లు విక్రయించే చిరు వ్యాపారుల వద్ద ఉద్యోగులు, సిబ్బంది అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే కొబ్బరికాయ కొట్టేచోట ప్రతీ భక్తుడి నుంచి రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లినా చూసీ చూడనట్టు వదిలేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయ పరిసరాలు చెత్తాచెదారాలతో దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఆదివారమైనా ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడంపై అసంతృప్తి చెందుతున్నారు.

● గోశాలలో.. గ్రాసానికీ కరువే..

ఆలయానికి సంబంధించిన గోశాలలో మొత్తం 13 గోవులు ఉన్నాయి. వాటికి ప్రతీ రోజు గ్రాసం వేస్తుంటారు. నెల ముందుగానే పశువుల గ్రాసం కొనుగోలుకు ఆర్డర్ చేస్తారు. కానీ ఆదివారం నాటి పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. గత నెల ఇచ్చిన పశుగ్రాసం పూర్తికావచ్చింది. ఇంతవరకు గ్రాసానికి సంబంధించి ఎటువంటి చర్యలు అధికారులు తీసుకోలేదు. ఆ గోవుల ఆకలి సంగతి ఆ ఆదిత్యుడికే తెలియాలి.

● పర్యవేక్షణ లోపమే.. శాపమా...

ఆదిత్యుడి ఆలయానికి సంబంధించి 34 సీసీ కెమెరాలు ఉన్నాయి. ప్రతీచోట జరుగుతున్న విషయాలను మోనటరింగ్ రూమ్ నుంచి లేదా ఈవో చాంబర్ నుంచి పరిశీలించే వెసులుబాటు ఉంది. కానీ ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది (మిగతా 7వ పేజీలో..)



ఆలయ ఆవరణలో చెత్తాచెదారం ఇలా..



వైభవంగా కంచమ్మతల్లి సంబరాలు

- ఆకట్టుకున్న విద్యుత్ వెలుగులు
- ప్రత్యేక ఆకర్షణగా ఇస్రోగేట్
- పదిరోజులపాటు కొనసాగనున్న ఉత్సవాలు

7లో

'మున్సిపల్' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

7లో



మందసలోని జెన్నా చెరువులో అల్లుకున్న గుర్రపు డెక్క

చెరువుల్లో ముంచుకొస్తున్న ముప్పు!

● పేరుకుపోయిన గుర్రపుడెక్క ● సాగునీటికి ఇక్కట్లు

హరిపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): చెరువులు, గెడ్డల్లో గుర్రపుడెక్కలు పేరుకుపోతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం వేళ రైతులకు సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు నీటి కాలుష్యం కారణంగా చెరువుల్లో చేపల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. పలాస నియోజకవర్గంలో మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో 416 చిన్నతరహా సాగునీటి చెరువులున్నాయి. వీటితోపాటు పలు గ్రామాల్లో మంచినీటి కోనేరులు 128 ఉన్నాయి. వీటిలో సగానికిపైగా చెరువుల్లో గుర్రపుడెక్క మొక్కలతో పేరుకు పోయి ప్రమాదం నెలకొంది. మందస (మిగతా 8వ పేజీలో..)



టిడ్కో కాలనీలో వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

టిడ్కో కాలనీలో కార్డన్ సెర్చ్

- సరైన పత్రాలు లేని ఒక కారు, ఆటో, 18 ద్విచక్రవాహనాలు స్వాధీనం
- చాపరలో కూడా రెండు ఆటోలు.. ఏడు బైకులు సీజ్

8లో



వైభవంగా కంచమ్మతల్లి సంబరాలు

- ఆకట్టుకున్న విద్యుత్ దీపాలంకరణ
- ప్రత్యేక ఆకర్షణగా ఇస్రో గేట్
- పది రోజులపాటు కొనసాగనున్న ఉత్సవాలు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఇస్రో సెట్

కంచిలి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఏడు గ్రామాల ఇలవేల్పు కంచమ్మతల్లి సంబరాలు కంచిలిలో ఆదివారం ప్రారంభమయ్యాయి. పది రోజుల పాటు జరగనున్న ఈ సంబరాల ప్రారంభవేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. కంచమ్మ దేవాలయం నుంచి బాణసంచా మెరుపులు, సాంస్కృతిక కార్యక్రమాలు, మేళతాళాలతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగిస్తూ ఉపాలయానికి తీసుకువచ్చారు. ఆలయంలో పదిరోజుల పాటు పూజలందుకున్న అనంతరం తిరిగి గ్రామదేవతను ప్రధాన ఆలయంలోనికి తీసుకువెళ్లనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. సంబరాల సందర్భంగా మండల కేంద్రం కంచిలితో పాటు దత్తత గ్రామాల్లో విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించారు. కంచిలి మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన గేట్లు, ఇతర హోర్డింగ్‌లు ఆకట్టుకున్నాయి. ఇస్రో వైభవాన్ని తెలిపేలా జాతీయ రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన గేటు ఆకర్షణగా నిలిచింది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులతోపాటు దత్తత గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.


ఆకట్టుకునేలా విద్యుత్ దీపాలంకరణ

సంప్రదాయాలను కొనసాగించాలి

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): దేశ సంస్కృతి సంప్రదాయాలను, కళలను కొనసాగిస్తూ భావితరాలకు అందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విద్యార్థులకు, శిక్షకులకు ప్రశంసా పత్రాలను అందించారు. నృత్య దర్శకులు నీరజ సుబ్రహ్మణ్యం, ఎల్.నందికేశ్వరరావు, నిక్కు హరి సత్యనారాయణ, నటుకుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జపాన్‌లో నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): జపాన్‌లో 5వ రోజు వరల్డ్ ఎక్స్‌పో 2025లో శ్రీకాంత్ శిష్యబృందం నృత్య ప్రదర్శన కొనసాగుతుంది. ఇండోనేషియా పెవీలియన్, భారత్ పెవిలియన్‌లో నార్త్ వెస్ట్ వేదికపై నిర్వహించిన నృత్య ప్రదర్శనలో నగరానికి చెందిన శివశ్రీ నృత్య కళానికేతన్ దర్శకుడు శ్రీకాంత్ రఘుపాత్రుని శిష్యబృందంచే జానపద నృత్యాలను ప్రదర్శించి ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. టోక్యోలో జపాన్ భారత రాయబార కార్యాలయంలో 30న ఆంధ్రా పరంపరా పేరిట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇదే బృందం చక్కటి ప్రదర్శన ఇచ్చారు. ఈ బృందాన్ని భారత్, జపాన్ అంబాసిడర్లు ప్రశంసించారు. రామ కౌండిన్య, అన్నా నేహా థామస్, గాయత్రి వర్షిత, నేహా పట్నాయక్, లలిత, చాందిని పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా వచ్చి అర్జీలను సమర్పించి, పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. అర్జీల నమోదుకు మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే అర్జీదారులు తమ అర్జీల వివరాలను 1100 నెంబర్‌కు నేరుగా కాల్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

శ్రీకాకుళం క్రైం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని టూటౌన్ సీఐ ఈశ్వరరావు సూచించారు. ఈ మేరకు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో నగరంలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా మంచి నడవడికతో జీవనం సాగించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీచ్ కబడ్డీ పోటీలకు రిఫరీలుగా ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న 12వ జాతీయ స్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు రిఫరీలుగా జిల్లా నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. సాధు శ్రీనివాసరావు (పీడీ, జడ్పీ హెచ్‌ఎస్, బొంతలకోడూరు), డి.తవిటమ్మ (పీడీ, జడ్పీ హెచ్‌ఎస్, నిమ్మతొర్లాడ), జి.అప్పన్నమ్మ (పీఈటీ, కేజీబీవీ, సింగుపురం) ఎంపికయ్యారు. వీరి ఎంపికపై జిల్లా కబడ్డీ సంఘం చైర్మన్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ప్రెసిడెంట్ నక్క రామకృష్ణ, కార్యదర్శి సాధు ముసలినాయుడు, కోశాధికారి నాగళ్ల రమేష్, మెట్ట తిరుపతిరావు అభినందించారు.

వైభవంగా సిరిమానోత్సవం నిర్వహించాలి

అరసవల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వైభవంగా సిరిమానోత్సవం నిర్వహించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక కొత్తపేట నుంచి జడ్పీ కార్యాలయం వరకు కాలువలు, శానిటైజింగ్, విద్యుత్తు స్తంభాలు పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.. అనంతరం పోలమ్మతల్లి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాలరాయుళ్లు అరెస్టు

ఎచ్చెర్ల, జూన్ 1(ఆంధ్రజ్యోతి): బొంతలకోడూరు గ్రామానికి సమీపంలో ఆదివారం పేకాటాడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. వీరి నుంచి రూ.11,700, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

మూగరోదన.. వినేదెవరు?

(ఐదో పేజీ తరువాయి)

దళారులు కొనుగోలు చేసి.. కబేళాలకు తరలిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

- **నిబంధనలు బేఖాతరు..**

పశువుల తరలింపు, రవాణాకు అనుమతిపత్రాలు తప్పనిసరి. సుదూర ప్రాంతాలకు వ్యవసాయ పనుల నిమిత్తం, పాడి అవసరాలకు తరలిస్తున్నామని ధ్రువీకరిస్తూ ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నుంచి అనుమతి తీసుకోవాలి. వాహనాల విషయంలో సైతం నిబంధనలు పాటించాలి. పశువులు ఎక్కడానికి, దిగడానికి వాహనాలు అనువుగా ఉండాలి. గాలి, వెలుతురు ఉండేలా చూడాలి. వైద్య కిట్లు వాహనంలో అందుబాటులో ఉండాలి. సుదూర ప్రాంతాలకు తీసుకెళ్తున్నట్లయితే పశుగ్రాసం ఉంచాలి. అవి నిల్చునే వెసులబాటు ఉండాలి. కానీ ఇవేవీ పాటించిన దాఖలాలు లేవు. రవాణా విషయంలో కనీసస్థాయిలో కూడా నిబంధనలు పాటించడం లేదు. ఒకే వాహనంలో 40 నుంచి 50 పశువులను కుక్కి తరలిస్తున్నారు. దారిపొడవునా కనీసం వాటికి ఆహారం వేయడం లేదు. దీంతో ఆకలికి, దప్పికతో అలమటించే పశువులు మార్గ మధ్యలో మృత్యువాతపడుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ప్రత్యేకంగా దృష్టి..



పశువుల అక్రమ రవాణా నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాం. సరిహద్దు ప్రాంతాలపై సైతం నిఘా ఉంచాం. అంతర్ రాష్ట్ర రహ దారులతోపాటు గ్రామీణ రోడ్లలో పశువులు తరలించే వాహనాలను తనిఖీ చేస్తున్నాం. అన్నిరకాల అనుమతులు, వ్యవసాయ పనుల నిమిత్తం తరలిస్తున్నారని తేలాక విడిచిపెడుతున్నాం. అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను నిలిపివేస్తున్నాం.

- చిన్నంనాయుడు, సీఐ, ఇచ్ఛాపురం

క్రీడాకారులకు ఉద్యోగావకాశాలు: ఎమ్మెల్యే కూన


విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించే ప్రతి ఉద్యోగ భర్తీల్లో క్రీడాకారులకు ప్రత్యేక కేటాయింపులు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగిన చిరంజీవి మెమోరియల్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎమ్మెల్యే క్రికెట్ కప్ ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత నెల రోజులుగా సీనియర్ క్రీడాకారులు రాష్ట్ర టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ ఆధ్వర్యం లో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో టెక్కలి జట్టుపై నరసన్నపేట విజయం సాధించి ఎమ్మె ల్యే కప్పు విజేతగా నిలిచింది. విజేతలకు ఎమ్మెల్యే రవికుమార్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ చైర్మన్, ఇలియాస్ కార్యదర్శి హసన్‌రాజు, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత చేతుల మీదుగా విజేత జట్టు నరసన్నపేటకు రూ.30 వేలు నగదుతో పాటు ట్రోఫీ అందించారు. అలాగే రన్నర్ జట్టు టెక్కలికి రూ.20 వేలు నగదుతో పాటు ట్రోఫీ అందించి ఇరుజట్లకు చెందిన 30 మంది క్రీడాకారులకు వ్యక్తిగత బహుమతులు అందించారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు బోర గోవిందరావు, నూకరాజు, తంగి గురయ్య, రెడ్డి గౌరి, నాగళ్ల మురళీధర్ యాదవ్, పైడి అయ్యప్ప పరమేశ్వర్ పాల్గొన్నారు.

దేశానికి సేవచేయడం మా అదృష్టం


సైనికులను సత్కరిస్తున్న గ్రామస్థులు

కవిటి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): భారతదేశానికి సేవ చేయడం ఒక అదృష్టంగా భావిస్తున్నామని ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికులు పీఎం విజయ్, పి.రమేష్ అన్నారు. కవిటి గ్రామానికి చెందిన వీరు సెలవుపై గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంలో ఆదివారం కవిటిలోని అగ్నికులక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో మండపం వీధిలో సైనికులను సత్కరించారు. జన్మనిచ్చిన గ్రామం నుంచి వెళ్లి దేశ రక్షణకు తమ వంతు బాధ్యతగా విధులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కుల పెద్ద పి.లక్ష్మణ మూర్తితోపాటు కులస్థులు, యువకులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గార, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల వద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మలుపులు వద్ద ఆర్ అండ్ బీ అధికారులు హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేశారు. గత నెల 25న 'ఈ మలుపులు.. ప్రమాదాలకు పిలుపు' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆర్ అండ్‌బీ ఏఈ గోవిందరావు స్పందించి ఆదివారం అంపోలు, కొమరవానిపేట, శ్రీకూర్మం తదితర రోడ్లు మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.. శ్రీకూర్మం జంక్షన్ నుంచి రోడ్డుమధ్యలో లైన్‌లు వేయించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయి


తిరుపతిరావు, తులసీలక్ష్మిలను సన్మానిస్తున్న దృశ్యం

అరసవల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఏ ఉద్యోగికైనా తన విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని ఉత్తరాంధ్ర జిల్లాల చీఫ్ ఇంజనీర్ రామ్‌గోపాల్ అన్నారు. ఆర్‌ఆర్ వంశధార ప్రాజెక్టు సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పనిచేసి శనివారం పదవీ విరమణ చేసిన ప్రగడ వెంకట తిరుపతిరావు సన్మాన కార్యక్రమం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఉద్యోగులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తిరుపతిరావు, తులసీలక్ష్మిలను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి పాల్గొని తిరుపతిరావును అభినందించారు. వంశధార అధికార యంత్రాంగం, సిబ్బంది, స్నేహితులు, కుటుంబ సభ్యులు అట్టాడ హరినారాయణ, ప్రగడ ఇంద్రజిత్, రమణమూర్తి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంగా ఎర్రన్నాయుడి సేవలు ఎనలేనివి


ఎర్రన్నాయుడు మాస్టారును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయుడిగా ఎర్రన్నాయుడు అందించిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గొల్లలవలస ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ఎర్రన్నాయుడును గ్రామ ప్రజలు, అధికారులు సమక్షంలో సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయుడి సేవలను వివరించి సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు, నాయకులు పి.సింహాచలం, ఆర్.కృష్ణంనాయుడు, బి.భాస్కరరావు, డోల జగన్, కరిమి రాజేశ్వరరావు, ఎం.బైరాగినాయుడు, శ్రీనివాసరావు, నాని, నారాయణదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయ దినసరి వేతన ఉద్యోగుల నుంచి హామీ పత్రాల సేకరణ

అరసవల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆదిత్యాలయం దినసరి వేతనంపై పనిచేస్తున్న ఉద్యోగుల నుంచి స్వచ్ఛందంగా విధుల నుంచి తప్పుకుంటామనే హామీ పత్రాలను ఆలయ అధికారులు సేకరిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 7 వరకు వారిని విధుల్లో కొనసాగించి, తరువాత తొలగించాలని రాష్ట్ర కమిషనర్ నుంచి ఆదేశాలు అందాయి. ఆ తర్వాత ఎవరినీ నియమించకపోవడంతో వారినే విధుల్లో కొనసాగుతున్నారు. అలాగే వారికి రావాల్సిన తొమ్మిది నెలల జీతాల బకాయిలను కూడా చెల్లిస్తామని ఆ ఆదేశంలో పేర్కొన్నారు. కానీ నేటికీ విధుల్లోనే ఉన్నామని, పని చేసిన దినాలకు జీతాలు చెల్లిస్తే సంతోషమని, లేకుంటే స్వామివారికి సేవ చేశామన్న తృప్తితో విధుల నుంచి తప్పుకుంటామని హామీ పత్రాలను సేకరిస్తున్నారు. ఈ పత్రాలపై కొంతమంది దినసరి ఉద్యోగులు సంతకాలు కూడా చేసి ఈవోకు అందించినట్టు తెలుస్తుంది. కాగా 49 మంది దినసరి ఉద్యోగులు ఆదిత్యాలయంలో పనిచేస్తున్నారు.


వజ్రపుకొత్తూరు: 1984-85లో చదువుకున్న పూర్వ విద్యార్థులు


గార జడ్పీ హైస్కూల్ 2005-06లో పదో తరగతి చదివిన విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

వజ్రపుకొత్తూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి హైస్కూల్‌లో 1984-85 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సందడిగా గడిపారు. పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వ హించారు. 40 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గుజరాత్‌లో పారిశ్రామికవేత్తగా స్థిరపడిన గుంటు వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వ హించారు.

30 ఏళ్ల తర్వాత..

కవిటి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం కలుసుకున్నారు. కవిటి ఉన్నత పాఠశాల ఆవరణలో 1992-95 వరకు చదువుకున్న మూడు బ్యాచ్‌లు కలిసి సందడి చేశారు. అలాగే రాజపురం ఉన్నత పాఠశాలలో 1997-2002 వరకు చదువుకున్న 10వ తరగతి విద్యార్థులంతా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.


కవిటిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గాన జడ్పీ ఉన్నత పాఠశాలలో..

గార, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గార జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల్ని సత్కరించారు.

17న గ్రామదేవత ఉత్సవం

గార, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్రీకూర్మంలో గ్రామదేవత మోహినీ భద్రాంబిక అమ్మవారి పండగ ఈ నెల 17న అనుపు ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మహిళలు పూర్ణకలశాలతో మేళతాళాలతో ఊరేగింపుగా అమ్మవారి గుడి వద్దకు వెళ్లి చల్లదనం చేస్తారు. ఇందులో భాగంగా 9న దేవరను తీసుకురావడంతో ఉత్సవం ప్రారంభమవుతుంది.

బీఎస్సీ పారామెడికల్, బీపీటీ, ఎంఎల్‌టీ కోర్సుల్లో అవకాశం

శ్రీకాకుళం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులకు పారామెడికల్ కోర్సుల్లో సువర్ణావకాశాలు ఉన్నాయని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీ పారామెడికల్, బీపీటీ, ఎంఎల్‌టీ కోర్సుల్లో 2024-25 సంవత్సరానికి గాను ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ చివరి అవకాశం కల్పించిందని వివరించారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 2వరకు అవకాశం ఉందని చెప్పారు. బీఎస్సీ న్యూరో ఫిజియాలజీ, డయాలసిస్, పెర్‌ఫ్యూజన్, రెసిపెటరీ, మెడికల్ రికార్డ్స్, ట్రాన్స్‌ఫ్యూజన్, రేడియోథెరపీ, బీపీటీ, ఎంఎల్‌టీ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కోర్సు పూర్తయ్యాక ఉద్యోగం కల్పించి ఆ ఫీజును జీతం నుంచి మినహాయిస్తామని తెలిపారు. ఈ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు పదో తరగతి, ఇంటర్, టీసీ, స్టడీ, కులధ్రువ పత్రాలతో ఈనెల 2వ తేదీ సాయంత్రం ఆరు గంటల్లోగా రాగోలులోని జెమ్స్ ప్రాంగణంలోని తమ కళాశాలలో అందించాలని సూచించారు. మరింత సమాచారం కోసం 9121999654, 7680945357, 795013422 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని ఆ సంఘ గౌరవాధ్యక్షుడు తిరుపతిరావు, అధ్యక్ష, కార్యదర్శులు శ్యామలరావు, సతీష్ తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికుల 12వ రోజు రిలే నిరాహారదీక్ష ఆదివారం శ్రీకాకుళం మునిసిపల్ కార్యాలయం వద్ద నిర్వహించి వంటా, వార్పు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్, టెక్నికల్ కార్మికులకు జీతాలు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24 వేలు చెల్లించాలని, పెన్షన్ కింద కనీసం రూ.10 వేలు ఇవ్వాలన్నారు. రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డీపీవో, పార్క్ వర్కర్లు, వాటర్ వర్క్స్ వర్కర్లు, ఎలక్ట్రికల్ వర్కర్లు, అటెండర్లు తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలకు ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): విశాఖలోని గాజువాకలో ఈ నెల 2,3 తేదీల్లో నిర్వహించనున్న 6వ రాష్ట్ర స్థాయి జూనియర్ మెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి 10 మంది బాలురు ఎంపికయ్యారు. కె.యశ్వంత్, కె.లక్ష్మీసాయి, కె.గుణశేఖర్, ఎస్.జోషి, ఎస్.దేవీ వరప్రసాద్, ఎస్.వినయ్ వరుణ్, ఎం.దినేష్, ఎ.రామ్‌చరణ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్, టి.గణేష్, జి.సత్య భార్గవ్ ఎంపికయ్యారు. వీరిని డీఎస్‌డీవో శ్రీధర్, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బీపీ లక్ష్మణదేవ్, కోచ్ ఉమామహేశ్వరరావు అభినందించారు.

క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలి

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): క్రీడా స్ఫూర్తిని జర్నలిస్టులు కొనసాగించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు గుంటూరులో జరుగనున్న రాష్ట్రస్థాయి మీడియా క్రికెట్ పోటీలకు జిల్లాకు చెందిన జర్నలిస్టులు ఆదివారం సాయంత్రం బయలుదేరారు. ఈ వాహనాన్ని తన బంగ్లా వద్ద జేసీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, డీఐపీఆర్వో కె.చెన్నకేశవరావు, ఎన్.రాజు, జర్నలిస్టు సంఘాల నేతలు, మీడియా క్రీడాకారులు పాల్గొన్నారు.

రాజపురం మాజీ సర్పంచ్ మృతి

కవిటి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాజపురం పంచాయతీ మాజీ సర్పంచ్, ప్రముఖ సిద్ధాంతి ప్రఫుల్ల పాడి(91) ఆదివారం మృతి చెందారు. ఈయన 1980లో సర్పంచ్‌గా సేవలందించారు. ఉద్దానం ప్రాంతంలో ఈయన సిద్ధాంతిగా అందరికీ సుపరిచితుడు. గతకొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటివద్దనే మృతి చెందారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ

రణస్థలం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, శరీర దారుఢ్యం కోసం నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ ఆదివారంతో ముగిసిందని వ్యాయమ ఉపాధ్యాయుడు చల్లా రాము తెలిపారు. నెల రోజుల పాటు 26 మంది విద్యార్థులకు వాలీబాల్ శిక్షణ ఇవ్వడం జరిగిందని స్పష్టం చేశారు.

ఆదిత్యా.. అవే అవస్థలు

(ఐదో పేజీ తరువాయి)

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆలయంలో పరిస్థితులు దిగజారిపోతున్నాయని భక్తులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆలయంలో పరిస్థితులు చక్కదిద్దాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు వద్ద ప్రస్తావించగా.. 'ఎటువంటి సమస్యలు ఉన్నా మా దృష్టికి తీసుకువస్తే చర్యలు చేపడతాం. ఉద్యోగులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించినా.. అక్రమ వసూళ్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు.



మండేఎండలో భక్తుల పాట్లు

రణస్థలం విద్యార్థుల ప్రతిభ


పతకాలతో క్రీడాకారులు

రణస్థలం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఆంధ్ర యూనివర్సిటీలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి పెన్‌కాట్‌సిలాట్ పోటీల్లో రణస్థలం విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. 15 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పది బంగారు, మూడు వెండి, రెండు కాంస్య పతకాలు సాధించారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి


గౌరినాయుడు(ఫైల్)

ఎల్.ఎన్.పేట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలబడవంజ గ్రామానికి చెందిన ఏపీఎస్పీ హెడ్‌కానిస్టేబుల్ పనస గౌరినాయుడు(47) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. గౌరినాయుడు విజయనగరంలోని ఏపీఎస్పీ 5వ బెటాలియన్‌లో పనిచేస్తున్నాడు. నాలుగురోజుల కిందట అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. స్వగ్రామం చింతలబడవంజలో అంత్యక్రియలు నిర్వహించారు. గౌరినాయుడుకు భార్య భవాని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో గుండెలవిసేలా రోదిస్తున్నారు. గ్రామంలో జరిగే దైవ కార్యక్రమాలు, శుభకార్యాలకు వచ్చిపోతూ తమతో సరదాగా ఉండేవాడని గ్రామస్థులు చెబుతున్నారు. అలాంటి వ్యక్తి చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

పోలీసుల అదుపులో దారిదోపిడీ దొంగలు?

శ్రీకాకుళం క్రైం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత కొద్దిరోజులుగా పలు ప్రాంతాల్లో అర్ధరాత్రులు లారీలను ఆపుతూ దోపిడీకి పాల్పడుతున్న తొమ్మిది మంది వ్యక్తుల్లో నలుగురుని శ్రీకాకుళం సీసీఎస్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం. అయితే ఇదే విషయంలో మరో ఐదుగురు వ్యక్తులు పరారై ఉన్నట్టు, వారి కోసం ఇటు శ్రీకాకుళం సీసీఎస్, అటు టెక్కలి పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో ఎక్కడెక్కడ ఎన్ని దారి దోపిడీలకు పాల్పడ్డారనే విషయం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జీయన్నపేటలో కేశవరావు కర్మకాండలు

● గ్రామంపై పోలీసుల నిఘా


కర్మకాండలు నిర్వహిస్తున్న నంబాల సోదరులు

టెక్కలి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు చీఫ్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు కర్మకాండలను ఆదివారం ఆయన స్వగ్రామం జీయన్నపేటలో కుటుంబసభ్యులు నిర్వహించారు. గతనెల 21న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేశవరావు మృతి చెందారు. అక్కడే ఆయన మృతదేహాన్ని పోలీసులు దహనం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన పెద్దసోదరుడు నంబాల ఢిల్లేశ్వరరావు, చిన్నసోదరుడు రాంప్రసాద్, కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు కలిసి హిందూ సంప్రదాయం ప్రకారం కేశవరావు కర్మకాండలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజాసంఘాల నాయకులు, సానుభూతిపరులు, అభిమానులు హాజరవుతారనే అనుమానంతో పోలీసులు జీయన్నపేటపై నిఘా పెట్టారు. రూరల్ సీఐ శ్రీనివాసరావు, కోటబొమ్మాళి, నౌపడా ఎస్ఐలు సత్యనారాయణ, నారాయణస్వామి జీయన్నపేటకు వచ్చీపోయే వారి వివరాలను ఆరాతీశారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి.. కేశవరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

ఆఫ్‌షోర్ నిర్వాసితుల బైక్ ర్యాలీ


చీపురుపల్లిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వాసితులు

మెళియాపుట్టి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, అప్పటి వరకు పోరాటం సాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. ఆదివారం చీపురుపల్లి, దాసుపురం గ్రామాల్లో నిర్వాసితులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు గడుస్తున్నా ఇంకా చాలామంది నిర్వాసితులకు నష్టపరిహారం అందించలేదన్నారు. సర్వే చేసిన సమయంలో 132 మందిని తప్పించారన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింహాచలం, సర్పంచ్ ఈశ్వరరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో కార్డన్ సెర్చ్

శ్రీకాకుళం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత్రునివలస టిడ్కో కాలనీలో పోలీసులు ఆదివారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేశారు. గంజాయి, మద్యం, నిషేధిత పదార్థాలు, సారా, అపరిచిత వ్యక్తులను గుర్తించేందుకు తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తులను విచారించి, వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన వాహన పత్రాలు లేని ఒక ఆటో, ఒక కారు, 18 ద్విచక్ర వాహనాలను గుర్తించారు. వన్ టౌన్ సీఐ పైడపునాయుడు, రూరల్ ఎస్ఐ కె.రాము సిబ్బంది పాల్గొన్నారు.

చాపరలో..


వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మెళియాపుట్టి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): చాపర గ్రామంలో ఆదివారం వేకువజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వాహనాల రికార్డులను పరిశీలించారు. సరైన పత్రాలు లేని రెండు ఆటోలు, ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరించిన, కొత్త వ్యక్తులు వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రతి గ్రామంపై నిఘా ఉంచినట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు అప్పన్న, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

122 వితంతు పింఛన్ల మంజూరు

మెళియాపుట్టి, జూన్1 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా 122 వితంతు పిం ఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో ప్రసాద్ పండా తెలిపారు. మండలంలో సమావే శం ఏర్పాటు చేసి పంపిణీ చేస్తామన్నారు. గతంలో దరఖాస్తు చేసిన వితంతువులకు పింఛన్లు మంజూరు చేసినట్లు చెప్పారు.

సందడిగా రేషన్ పంపిణీ

● డిపోల ద్వారా కార్డుదారులకు సరఫరా ● వృద్ధుల ఇళ్లకు వెళ్లి సరుకుల అందజేత

జిల్లాలో ఆదివారం డిపోల ద్వారా రేషన్ పంపిణీ సందడిగా ప్రారంభమైంది. కార్డుదారులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఒంటరి దివ్యాంగులు, 65 ఏళ్ల పైబడిన వృద్ధుల ఇళ్లకు వెళ్లి సరుకులు అందించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులను అందించారు. ఇందులో అధికారులు, ప్రజా ప్రతినిధులు భాగస్వాములయ్యారు. (-ఆంధ్రజ్యోతి బృందం)


లావేరు మెయిన్‌వీధిలో రేషన్ డిపోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


అరసవల్లి: రేషన్ అందిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు


ఆమదాలవలస: శివన్నారాయణ కాలనీలో ఎమ్మెల్యే రవికుమార్..


కవిటి: సరుకులు అందిస్తున్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్


పోలాకి: మబగాంలో రేషన్ అందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


కొత్తూరు: మాతలలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ


పలాస: రేషన్ పంపిణీ చేస్తున్న ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు


శ్రీకాకుళంరూరల్: కిల్లిపాలెంలో డిపోను ప్రారంభిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్


టెక్కలి: పెద్దబ్రాహ్మణవీధిలో ఆర్డీవో కృష్ణమూర్తి


నరసన్నపేట: జమ్ములో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దిలీప్ చక్రవర్తి

ఎంత పెద్ద పుట్టగొడుగో..

పలాస, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సాధారణంగా పుట్టగొడుగులు 10, 15 సెంటీమీటర్ల పొడవు ఉంటాయి. కానీ, పలాస పట్టణంలోని చిన్నకళియా పండా తోటలో ఏకంగా అడుగు పొడవు, అడుగున్నర మందం ఉండే భారీ పుట్టగొడుగు అందర్నీ ఆకట్టుకుంటోంది. దీని బరువు కిలో వరకూ ఉండడంతో అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చిన్నతిరుపతిగా పేరుగాంచిన ఈ ప్రాంగణంలో ఉన్న పూలతోటలో ఈ భారీ పుట్టగొడుగు భక్తులకు కనిపించింది. తొలుత వారంతా ఓ తెల్ల బంతిగా భావించారు. దాన్ని పరిశీలించి చూసేసరికి పుట్టగొడుగుగా నిర్ధారించారు. రెండు రోజులు వర్షాలు కురవడంతో నేలచల్లబడంతో పుట్టగొడుగు వెలసింది. ఇది తినడానికి వినియోగపడదని, కేవలం చూసేందుకే అని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.



ఆదాయం వచ్చే పంటలను సాగు చేయండి


మామిడి పండ్లను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త హరికుమార్, సిబ్బంది

పోలాకి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడి తక్కువ.. ఆదాయ ఎక్కువగా వచ్చే పంటలను రైతులు సాగు చేసుకోవాలని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వి.హరికుమార్ సూచించారు. ఆదివారం ఈదులవలసలో వికసిత కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కొబ్బరి, ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలన్నారు. యాంత్రీకరణ, ఆధునిక పద్ధతులతో వ్యవసాయం లాభసాటి అవుతుందన్నారు. ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ఉద్యానవన అధికారి కె.సునీత, సీహెచ్.ఢిల్లీశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధికారులు వెంకటేష్, కంచు రఘువర్మ పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా దువ్వాడ


శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న యూనియన్ సభ్యులు

కాశీబుగ్గ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలోని కాటమ్మ తల్లి మినీ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా దువ్వాడ శ్రీకాంత్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాశీబుగ్గలోని యూనియన్ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. తనను గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మినీ ట్రాన్స్‌పోర్టు కార్మికులు, వాహన యజమానులు ఐక్యతతో ఉండి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు.అధ్యక్షుడిగా జనా మోహన్, ఉపాధ్యక్షుడిగా మేఘనాథ్, కార్యదర్శిగా రాజేష్, కోశాధికారిగా సనపల అమ్ములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నందిగాం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాపుతెంబూరులోని మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు పోలాకి రామకృష్ణ ఆధ్వర్యంలో పురోహితుడు వెంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో విశేష పూజలు జరిపించారు. అనంతరం మేళతాళాలు, భక్తుల కోలాహలం మధ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పాలపోలమ్మ జాతర

వజ్రపుకొత్తూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాంలో పాలపోలమ్మ తల్లి జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం రాజాం కాలనీ నుంచి ఆలయం వరకు మేళతాళాలు, ఘటాలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు.


జాతరలో భక్తులు

కాలేజీకి వేళాయే

(ఐదో పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో -9, ట్రైబుల్ వెల్ఫేర్‌లో -1, ప్లస్ 1 జూనియర్ కళాశాలలు -9, మహాత్మ జ్యోతిరావుపూలే మహిళా కళాశాల- 1 చొప్పున ఉన్నాయి. ఆయా కళాశాలల్లో 20,678 మంది విద్యార్థులు ఈఏడాది ద్వితీయ ఇంటర్ చదవనున్నారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని అధ్యాపకులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కళాశాలల్లో వసతులపై అవగాహన కల్పించారు. అడ్మిషన్లు చేపట్టారు. ఇంకా సప్లిమెంటరీ పరీక్షలు రాసిన పది విద్యార్థులను కూడా అడ్మిషన్లు చేసుకునేందుకు వీలు కల్పించారు. ఇంటర్‌లో ప్రథమ సంవత్సరం నుంచి ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు గణితం ఏ, బీ పేపర్లు స్థానంలో ఒకే పేపర్‌కు పరీక్ష నిర్వహిస్తారు. జువాలజీ, బోటనీ కలిపి బయాలజీ పేరుతో ఒకే పేపరును అమలు చేస్తారు. ఈ ఏడాది నుంచి ఎంబైపీసీ అనే కొత్త కోర్సును అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇది చదివిన వారు ఎంసెట్, నీట్ రెండూ రాసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాలల్లో చదివేవారికి విద్యార్థి మిత్ర పథకం కింద ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలను అందజేయనున్నారు. ఈ ఏడాది తొలిసారిగా నీట్, ఐఐటీ, ఈఏ సెట్(ఎంసెట్) తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులను ప్రోత్సహించేలా మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు నూతన సిలబస్ మేరకు బోధిస్తారు. మధ్యాహ్నభోజనం పథకాన్ని కొనసాగిస్తారు. ఈ మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాట్లు చేశామని ఇంటర్ విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే ప్రిన్సిపాల్స్, అధ్యాపకుల బదిలీ పక్రియ కూడా సోమవారంతో ముగియనుంది. ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు, ఇతర సిబ్బంది ఈనెల 8లోగా బదిలీ అయిన స్థానాల్లో విధుల్లో చేరనున్నారు.

చెరువుల్లో ముంచుకొస్తున్న ముప్పు!

(ఐదో పేజీ తరువాయి)

మండలంలో జెన్నాచెరువు, పెద్ద చెరువు, మంచి నీటి కోనేరు, మధ్య చెరువు, జెన్నాసాయి, సంకుజోడితోపాటు బెండి గెడ్డ, సునముది, మహేంద్రతనయా నదుల్లో సైతం గుర్రపుడెక్క పేరుకుపోయింది. దీంతో నీటి నిల్వ స్థాయి తగ్గడంతోపాటు నీరు కలుషితమవుతోంది. రైతులు సాగు నీటికోసం పలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించి ఖరీఫ్ పంటకు సాగు నీరందించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

చెరువంతా అల్లుకుని..



చెరువుల్లో నీరు తేటదనం వస్తుందని.. ఒకటిరెండు గుర్రపుడెక్క మొక్కలు వేశాం. ఇప్పుడు చెరువంతా అల్లుకొని కనీసం నీటిలో దిగలేని పరిస్థితి. చెరువుల్లో జలగలు ఎక్కువై నీరు ఉపయోగించలేని దుస్థితి ఏర్పడింది.

-తమిరి భాస్కరరావు, మాజీ సర్పంచ్, హంసరాళి

నిర్మూలించాలి



చెరువుల్లోనే కాదు.. నదులు, గెడ్డల్లోనూ గుర్రపుడెక్క అల్లుకొని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో యువత స్వచ్ఛందంగా గుర్రపుడెక్కను తొలగించి చెరువులను శుభ్రపరుస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమూలంగా నిర్మూలించే చర్యలు తీసుకోవాలి.

-పినకాన రాజు, రైతు, దేవుపురం

న్యూస్ బాక్స్

నేటి నుంచి ప్రతిష్ఠోత్సవాలు

నరసన్నపేట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపాడులో పురాతన హాలహాలేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠోత్సవ కార్యక్రమాలు సోమవారం నుంచి ఈ నెల 5 తేదీ వరకు జరగనున్నాయి. రెడ్డికపేట, నారాయణవలస, దూకలపాడు, గొట్టిపల్లి, సత్యవరం, తండ్యాలవానిపేట తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొననున్నారు.

4న వెన్నుపోటు దినం

పలాస/నరసన్నపేట/టెక్కలి, జూన్1 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ఒక్క హామీ నెరవేర్చలేదని వైసీపీ నాయకులు అన్నారు. ఈ నెల 4న కాశీబుగ్గ వైఎస్ స్క్వేర్ వద్ద వెన్నుపోటు దినం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆదివారం స్థానిక జీఎంఆ కాలనీ ప్రగతి భవన్‌లో మాజీ మంత్రి సీదిరి అ ప్పలరాజు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జిల్లా పరిశీలకుడు, ఎమ్మెల్సీ కంబా రవిబాబు ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు. ●నరసన్నపేట, టెక్కలిలో కూడా వెన్నుపోటు దినం పోస్టర్‌ను వైసీపీ నాయకులు ఆవిష్కరించారు.

పేదలకు ఆహారం పంపిణీ


ఆహారం అందిస్తున్న దృశ్యం

పలాస, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సత్యసాయి విద్యావిహార్ (రామకృష్ణాపురం) ఆధ్వర్యంలో ఆదివారం పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో యాచకులు, పేదలకు ఆహారం అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి విద్యావిహార్ నిర్వాహకుడు, ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్ కౌన్సెలింగ్

మెళియాపుట్టి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి ఏకలవ్య పాఠశాలలో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

నౌపడా-మెళియాపుట్టి రోడ్డుకు లైన్ క్లియర్

టెక్కలి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నౌపడా-మెళియాపుట్టి స్టేట్ రోడ్డుపై ఎట్టకేలకు వాహనాల రాకపోకలకు లైన్ క్లియర్ అయ్యింది. గోపినాథపురం వద్ద వారం రోజులుగా చేపడుతున్న కల్వర్టు పనులు పూర్తయ్యాయి. దీంతో ఆదివారం వాహనాల రాకపోకలకు ఆర్‌అండ్‌బీ అధికారులు అనుమతిచ్చారు. డీఈఈ రవికాంత్ పరిశీలించారు.

నేటి నుంచి జడ్డమ్మతల్లి ఉత్సవాలు

పాతపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బూరగాం గ్రామదేవత జడ్డమ్మతల్లి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 10 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. సోమవారం దేవరను తీసుకువస్తామని నిర్వాహక కమిటీ తెలిపింది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసింది. గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.